యింటిలోనే భోజనం చేసేద్దాం. కాదనకండి. ప్లీజ్ రాజుగరూ, మీరుకూడా. ప్లీజు" బ్రతిమలాడుతున్నట్లు వుంది అతని ధోరణి.

"క్షమించండి. ఇప్పుడు అలాంటివేమీ వద్దు. మళ్ళీ తప్పకుండా వస్తాను" మొహమాట పడిపోయాడు చౌదరి.

పుస్తకాలు మడిచి, దొంతరగా పెడ్తూ, గబగబ అన్నాడు రాజు, "మధ్యవర్తిగా నేను చెప్పేది మీరిద్దరూ వినాలి. మనం ముగ్గురం ఇప్పుడు శివరావుగారింటికి వెళ్దాం. వారింట్లో కాఫీలు త్రాగేస్తాం హాయిగా. ఘుషారుగా బజారుకి వెళ్ళిపోతాం ముగ్గురం. అక్కణ్నుంచి ఒక బ్రహ్మాండమైన, ముఖ్యమైన, తప్పనిసరైన పనిమీద నేను ఇంటికి పోతాను. మీరిద్దరూ సినిమాకు వెళ్తారు. ఆ తర్వాత వాళ్ళింట్లోనే చౌదరి కూడా భోజనం చేసేస్తాడు. ఆ తర్వాత రూం మార్చేస్తాడు. ఇదీ ప్రోగ్రాం. నో మోర్ ఆల్టరేషన్స్ ప్లీజ్."

○ ○ ○

శివరావుకి మంచి నిద్ర పట్టేసింది రాత్రంతా.

"ఎనిమిదయ్యింది. రోజూకంటే గంటన్నర సేపు ఎక్కువగా పడుకున్నారు. ఇక లేవండి" అంటూ తట్టింది పంకజం.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ, సగం తెరిచిన కళ్ళతో భార్యను చూసి-కళ్ళు పెద్దవిగా తెరచి, విస్తుపోయాడు శివరావు.

"ఇదేవిటీ?!! వాలుజడా, కోలబొట్టూ కదూ నీ కిష్టం?—ఈ మార్పు ఏమిటి?!" పట్టపగలు చుక్కలు పొడిచినంతగా ఆశ్చర్యపోతున్నాడు.

"కానీ—ముడీ, గుండ్రటి బొట్టు మీకు ఇష్టం. నేనందంగా కనిపించవలసిందీ—నాకూ ఊళ్ళోవాళ్ళకి కాదు—నా భర్తకు. పైగా.... నేను....ఇద్దరు పిల్లల తల్లిని" ఓరగా నవ్వి. బ్రష్షూ, పేస్టూ అందించింది భర్తకు.

ఆశ్చర్యపోతూనే లేచి, లుంగీ సరిగ్గా కట్టుకుని, బ్రష్షూ, పేస్టూ అందుకుని, గబగబా గది బయటకు నడిచాడు శివరావు. చూపు త్వరగా చౌదరి రూమువైపు మళ్ళింది. రూముకు గొళ్ళెం పెట్టుంది.

'గది అద్దెకు యివ్వబడును' అనే బోర్డుతో గేటువైపు వెళ్తూ, యింటాయన విష్ చేస్తూ నవ్వాడు.

యాంత్రికంగా తిరిగి విష్ చేశాడు శివరావు.

"ఏంతి నాన్నాలూ? ఆ రూములో వుండే అంకుల్ లేలేం?" అన్నాడు చంటాడు.

"రూము ఖాళీ చేసి వెళ్ళిపోయార్రా!.... ఆ రూముకూడా మనమే తీసుకుందామా అనుకుంటున్నాను" తనలో అనుకుంటున్నట్లు అన్నాడు శివరావు, సాలోచనగా. □




మినీ కథ

# జనతా

గుడిమెట్ల గోపాలకృష్ణ

ఏ పనిచేసినా విజయం చేకూరాలనే ఆంక్షతో రాజు తన పిల్లలిద్దరికీ 'విజయశ్రీ' అని 'విజయ్ కుమార్' అని పేర్లుపెట్టేడు.

వాళ్ళకి పేర్లు పెట్టడంతో వూరుకోక ప్రతి పనీ స్వంతంగా చేసుకునేటట్టు ట్రయినింగు ఇవ్వటం మొదలు పెట్టేడు. సత్యవతికి కూడా పిల్లల్ని 'ఇలా' పెంచాలి అని సమయం దొరికినపుడల్లా నూరి పోసేవాడు. పరిమళా సోమేశ్వర్ పుస్తకాలు చదివించడం ధైర్యం పెంచే ఇంగ్లీష్‌మూవీస్ చూపించడం వరకూ యెంతో యిదిగా చేసేవాడు.

రాజు ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా, శ్రీమతి సత్యవతి ఎన్నికిటుకులు వుపయోగించినా పిల్లల విషయంలో ఆశించదగ్గ మార్పు కన్పించలేదు. పైగా ఖర్చు ఎక్కువకాసాగింది.

ఖర్చులు ఇలా ఎక్కువౌతున్న సమయంలోనే శ్రీకాకుళం నించి, నెలనెలా డబ్బు పంపుతుండమని రిటయిరయ్యేక తండ్రినిచూసే బాధ్యత కొడుకుది కాదా అంటూ ఘాటైన వుత్తరం వచ్చింది రాజుకి.

తీవ్రంగా ఆలోచించి రాజు ఖర్చులు తగ్గించుకునే పథకాన్ని అమల్లోకి తెచ్చేడు. అదే 'జనతా' పద్ధతి.

పిల్లల్ని ఎక్కడికి తీసుకువెళ్ళాలన్నా రైలుబండిలో 'జనతా' క్లాసులోనే తీసుకెళ్ళేవాడు.

వాళ్ళకు 'జనతా' బట్టలు కొనేవాడు.

'జనతా' పేకెట్ మీల్సు 'జనతా' టిఫిన్ ఇప్పించేవాడు.

పిల్లల్లో పొదుపుగుణం పెరిగినా పెరక్కపోయినా 'జనతా' అని ప్రతి దానికి అడిగే అలవాటయిపోయింది. రాజుకు 'జనతా' పద్ధతివల్ల నెలకు ఎనభై రూపాయిల మిగులు కన్పించింది. అయితే రాజు జనతా పద్ధతుల వల్ల ఆదా కావాల్సింది నూరురూపాయలు మినిమమ్ అని అంచనావేశాడు. మిగతా ఇరవై రూపాయలు ఎలా ఖర్చయిపోతున్నాయి చెప్మా అని ప్రశ్నించుకున్నాడు.

ఈ విషయాన్ని విజయశ్రీ, విజయ్‌కుమార్ లతో చర్చించాలని నిశ్చయించాడు. సాధకబాధకాలు పిల్లలకు తెలియడం మంచిదనుకున్నాడు. బడ్జట్ ఎలా వేస్తే బాగుంటుందని పిల్లల్ని సజెషన్ అడిగేడు తన ట్రయినింగు ఎలా పని చేస్తున్నదీ తెలుసుకోవచ్చునన్న ధ్యాసతో.

విజయశ్రీ ఠక్కున అంది.

"మమ్మీ వేమరీ ఎక్కువ ఖర్చులు. మరో జనతా మమ్మీని చూడు డాడీ....!!"

"....................!!!" □